

యువశక్తి ఫౌండేషన్ సేవలు మరింత విస్తృతం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

యువశక్తి ఫౌండేషన్ సేవలను విస్తృతం చేయనున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు మోహన్ తెలిపారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో సంస్థ కో-కన్వీనర్‌గా శివాజిని నియమిస్తూ నియామకపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫౌండేషన్ ఆశయాలను ముందుకు తీసుకపోయి సమాజంలో యువతకు మరింత సహాయ సహకార అందించడమే తమ లక్ష్యమని అన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో పౌండేషన్ సేవలను విస్తృతం చేయనున్నట్లు తెలిపారు. చదువుకోవాలనే ఉద్దేశం, ప్రతిభ ఉండి పేదరికం కారణంగా చదువుకు దూరమైన యువతను గుర్తించి వారికి తిరిగి విద్యను దగ్గర చేసే కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. అలాంటి యువ విద్యార్థులను గుర్తించి వారికి కళాశాల ఫీజులు, పరీక్ష ఫీజులు తమ సంస్థ ద్వారా చెల్లించి వారిని బాగా చదువుకునేలా ప్రోత్సహం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రెడ్డి గణేష్, శివాజీ, శశి కుమార్, నాగ, అమర్నాథ్, గోవర్ధన్, మోక్షిత్, చరణ్, చైతన్య పాల్గొన్నారు.


టైల్స్ రాక..నాపరాయి పోక

- కడప స్టోన్స్‌కు ఆదరణ కరువు
- తగ్గిన వ్యాపారం
- పెరిగిన విద్యుత్ ఛార్జీలు, రాయల్టీలు
- ఆందోళనలో కార్మికులు, పరిశ్రమ యజమానులు



ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

ఒకప్పుడు కడప స్టోన్స్ పేరుతో ఎర్రగుంట్ల నాపరాయి ఎంతో ప్రాముఖ్యం సంతరించుకుంది. ప్రస్తుతం మార్కెట్‌లో టైల్స్, గ్రానైట్ , మార్బుల్స్ రావడంతో నాపరాయి వాడకం పూర్తిగా తగ్గిపోయింది. దీంతో నాపరాయి వ్యాపారం అధోగతి పాలవుతోంది. పరిశ్రమల యజమానులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోడల నిర్మాణానికి గోడ రాయి, సపట వేసేందుకు, షోకేసులకు, వాకిలి, గూటి కప్పులకు ఇలా పలు రకాలుగా గృహ అవసరాలకు నాపరాయిని వాడే వారు. ప్రస్తుతం నాపరాయి వినియోగం చాలా తగ్గింది. పాలిష్ రాయి వ్యాపారాలు లేక పరిశ్రమల యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంద ఏళ్ల నుంచి నాపరాయినే వాడుతున్నారు. 50 సంవత్సరాలుగా పరిశ్రమలు నెలకొల్పి ఉపాధి పొందుతున్నారు. 2003లో తోపడా యంత్రాలు రాకతో ఉత్పత్తి పెరగడంతో పాటు, వ్యాపారం పుంజుకుంది. కానీ ప్రస్తుతం వ్యాపారాలు లేకపోవడంతో పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు పని కరువైంది. నెలలో 15 రోజులు మాత్రమే పనులు చేయించుకుంటున్నారు. పట్టణంలో సుమారు 200 పరిశ్రమలున్నాయి. వాటికి అనుసంధానంగా ఉపాధి పొందుతున్న వారు సుమారు పదివేల మంది ఉన్నారు. గనులలో రాయి తీసేవారు, గనుల వద్ద నుంచి మిషన్లకు రాయి తరలించేవారు, మిషన్ల వద్ద రాయి పాలిష్ చేసి తయారు చేసేవారు, ట్రాక్టర్లు, లారీలతో పాటు ఎగుమతులకు వినియోగించే ట్రక్కు డ్రైవర్లు ఇలా చాలామంది నాపరాయి మిషన్లకు అనుసంధానంగా ఉపాధి పొందుతున్నారు. గతంలో రాష్ట్రంలో అన్ని ప్రాంతాలతో పాటు పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు ఎక్కువగా నాపరాయి ఎగుమతులు అయ్యేవి. 20 ఏళ్ల కిందట అట్టపెట్టెలలో నాపరాలను ప్యాక్ చేసి షిప్‌ల ద్వారా అమెరికా తదితర దేశాలకు ఎగుమతులు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం ఒక్క తమిళనాడు రాష్ట్రానికే ఎగుమతులు జరుగుతున్నాయి. మారుతున్న కాలానుగుణంగా నాపరాయి బదులు టైల్స్, గ్రానైట్, మార్బల్ వాడకం పెరిగింది. నాపరాయి తయారీ ఖర్చు పెరిగింది. కానీ అధునాతన యంత్రాలతో(3డి) రంగురంగుల టైల్స్ ఖర్చు తక్కువలో తయారవడం, పైగా వినియోగదారులకు ధర తక్కువ ధరకు టైల్స్, గ్రానైట్ రాయి దొరకడంతో నాపరాయి మరుగున పడింది. ఈ క్రమంలో ధరలు దాదాపు సమానంగా అవడంతో వినియోగదారులు తక్కువ బరువుతో కంటికి ఇంపుగా ఉన్న టైల్స్ నే ఎక్కువగా వినియోగిస్తున్నారు. భవిష్యత్తులో నాపరాయి వ్యాపారం లేకపోతే వేల మందికి ఉపాధి కరువు అయ్యే ప్రమాదం ఉంది. ప్రభుత్వం సహకరించి రాయల్టీ, విద్యుత్ బిల్లులు తగ్గించాలని పలువురు కోరుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలకు, నిర్మాణాలకు నాపరాయిని వాడడం వల్ల వ్యాపారం వస్తుందని పలువురు పరిశ్రమలు యజమానులు అభిప్రాయపడుతున్నారు.



పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు

వ్యాపారం పూర్తిగా తగ్గింది

నాపరాయి వ్యాపారం గతంలో ఎన్నడూ లేని విధ ంగా పూర్తిగా తగ్గిపో యింది. కార్మికుల కూలి ఖర్చులు పెరిగి పోయాయి. దీంతో పాటు విద్యుత్ ఛార్జీలు పెంచారు. రాయల్టీ పెం చారు. డిమాండ్ తగ్గడంతో ఉత్పత్తి అయిన పాలిష్ నాపరాయి స్టాకు చాలా ఉండిపోయింది. ఒక అడుగు పాలిష్ రాయి తయారీ ఖర్చు రూ. 23 పడుతుంది. అదే ధరకు అమ్ము తున్నాం. వ్యాపారంలో ఏమి మిగలడం లేదు. ఆర్డర్లు రావడం లేదు. రెండు లోడ్లు స్టాకు ఉండిపోయింది. పరిశ్రమను నడపడం ఇబ్బందిగా మారింది. ప్రభుత్వ నిర్మాణాలకు నాపరాయిని వినియోగించాలని కోరుతున్నాం.



- కిరణ్, పాలిష్ మిషన్ యజమాని

15 రోజులు మాత్రమే పనులు



వ్యాపారాలు లేకపోవడంతో పనులు నెలలో 15 రోజులు మాత్రమే చేయించుకుంటున్నాం. గతంలో వారానికి ఒకలోడు పోయేది. కానీ ప్రస్తుతం నెలకు ఒక లోడు మాత్రమే పోతోంది. కార్మికులకు ఉపాధి కంటిన్యూగా చూపలేక పోతున్నాం. అయినా ఖర్చు మాత్రం పెరిగిపోయింది. పాలిష్ రాయి లోడ్లు తమిళనాడుకు పంపించిన డబ్బులు రావడం లేదు. టైల్స్, గ్రానైట్, మార్బల్ వాడకం పెరగడంతో పాలిష్ రాయి వాడకం తగ్గిపోయింది. రాయితో పోల్చుకుంటే చూసేందుకు టైల్స్ బాగుంటాయని వినియోగదారులు ఇష్టపడుతున్నారు. రాయి ఎక్కువ కాలం మన్నిక వస్తుంది వినియోగదారులు గుర్తించాలి.

- హరి ప్రసాద్ రెడ్డి, పాలిష్ మిషన్ యజమాని

ఖర్చులు బాగా పెరిగాయి



మిషన్ల బాడుగలు, కరెంటు బిల్లులు ఇతరత్రా ఖర్చులు పెరిగాయి. ముతకరాయి రేటు కూడా పెరిగింది. దీంతో తయారీ ఖర్చు విపరీతంగా పెరిగింది. రాయికి డిమాండ్ లేకపోవడంతో తక్కువ ధరకు ఇస్తున్నాం. అయినా తోలిన రాయికి డబ్బులు రావడం లేదు. కార్మికుల దినసరి ఖర్చులు, కూలి పెరిగాయి. కార్మికులకు, ఇతరులకు బాకీ కట్టి పనికి వచ్చేందుకు లక్షల రూపాయలు అప్పుగా ఇచ్చాం. వ్యాపారంలో పెట్టుబడులు పెట్టాం. కనుక వేరే వ్యాపారంలోకి వెళ్లలేక నలిగిపోతున్నాం.

- శివారెడ్డి,పాలిష్ మిషన్ యజమాని



క్రీడలను ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

క్రీడలతో మానసిక ఉల్లాసం

రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెరుగుతుందని రాష్ట్ర రవాణా యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి టోర్న మెంట్‌లో ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్నివిదాల సహకరిస్తోందని తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించేవారికి బంగారు భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. క్రీడల్లో రాణించి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని అన్నారు. నెహ్రూ యువకేంద్ర యూత్ ఆఫీసర్ మణికంఠ మాట్లాడుటూ అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 12 టీములు పాల్గొనయ్యాని భవిష్యత్తులో మరిన్ని క్రీడా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం విజేతగా నిలిచిన రాజంపేట టీమ్‌కు నగదు బహుమతి, కప్, రన్నర్స్‌గా నిలిచిన రాయచోటి టీమ్‌కు నగదు బహుమతి, కప్ నెహ్రూ యువకేంద్ర యూత్ ఆఫీసర్ మణికంఠ, విఆర్‌డిఎస్ సురేంద్రారెడ్డి అందచేజేశారు. పాల్గొన్న ప్రతి క్రీడాకారునికి ప్రశంసాపత్రం అందచేశారు. కార్యక్రమంలో డిఎస్‌డిఒ గౌస్ బాష,నెహ్రూ యువకేంద్ర సిబ్బంది సోమల, బాలాజీ వెంకట్, దినేష్, ప్రేమ, సుబ్బయ్య, టిడిపి నాయకులు డాక్టర్ విద్యాసాగర్, మదన్ మోహన్ రెడ్డి, గాజుల ఖాదర్ బాష, సాయి కళాశాల డైరెక్టర్ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమం కోసం కృషి

పాడి రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన్ద మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్రవ్యాప్తంగా పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తోందన్నారు. ఈనెల 30 వరకు నిర్వహిస్తారన్నారు. జిల్లాలోని పాడి రైతులందరూ తమ పశువులకు ఎటువంటి వైరస్ సోకకుండా తప్పకుండా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలన్నారు. పశు వైద్య సహాయకులు పాడి రైతుల ఇంటి ముంగిటకే వెళ్లి ఈ టీకాలు వేస్తారని చెప్పారు. పాడి రైతులు పశుసంవర్ధక శాఖ సిబ్బందికి సహకరించాలన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందించే భాండాగారాలని ఎపి గ్రంథాలయ పరిషత్ అధ్యక్షులు గొనుగుంట్ల కోటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన మదనపల్లె ప్రధాన శాఖ గ్రంథాలయాన్ని సందర్శించారు. గ్రంథాలయానికి వచ్చిన పాఠకులు, పిల్లలతో గ్రంథాలయ ఉపయోగాల గురించి అడిగి తెలుసుకున్నారు. వారు చెప్పిన తీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథాలయాలలో విద్యార్థులకు సాంకేతిక, సమాజ విజ్ఞానం పెంపొందించే పుస్తకాలతో పాటు చందమామ కథలు, నీతి కథలు, భగవద్గీత పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు అన్నిరకాల పుస్తకాలు లభిస్తాయన్నారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోయి పిల్లలు, పెద్దలు మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాలకు బానిసలైపోతున్నారని తద్వారా మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయ పఠనాన్ని అలవర్చుకొని మానసిక వికాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం, సిఎం చంద్రబాబు గ్రంథాల



గ్రంథాలయానికి వచ్చిన పిల్లలను అభినందిస్తున్న కోటేశ్వరరావు

ఆదాయపన్నును సక్రమంగా చెల్లించాలి

- రాష్ట్రంలో పన్ను ఎగవేతదారులే ఎక్కువ
- చెల్లింపు దారులు తగ్గారు
- ఆదాయ పన్ను శాఖ ఉమ్మడి రాష్ట్ర చీఫ్ ప్రిన్సిపల్ కమిషనర్ మిథాలి మధుస్మిత

ప్రజాశక్తి - కడపఅర్బన్

తెలంగాణ కంటే ఆంధ్రప్రదేశ్‌లో ఆదాయపన్ను చెల్లింపుదారులు తగ్గిపోయారని, దీంతో రాబడి తగ్గిపోయిందని, వ్యాపారులు ఆదాయాన్ని పెంచుకొని ఎక్కువ మొత్తంలో ఆదాయపన్ను చెల్లించాలని ఆదాయపన్ను శాఖ ఉమ్మడి రాష్ట్ర చీఫ్ ప్రిన్సిపల్ కమిషనర్ మిథాలి మధుస్మిత కోరారు. ఆదివారం ఆదాయపన్ను కార్యాలయంలో మిథాలి మధుస్మితతో పాటు చీఫ్ కమిషనర్ సురేష్ బత్తిని, ప్రిన్సిపల్ కమిషనర్ సునీత బిల్లా, అడిషనల్ కమిషనర్ శ్రీధర్‌ను ఎపి ఆర్డిటర్స్ అసోసియేషన్ చీఫ్ అడ్వయిజర్, రాష్ట్ర మాజీ అధ్యక్షులు పఠాన్ షరీఫ్‌ఖాన్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మధుస్మిత మాట్లాడుతూ సకాలంలో ఆదాయపన్ను చెల్లించి రాష్ట్ర, దేశాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పన్ను ఎగవేతదారుల ఎక్కువయ్యారని, తమ వ్యాపారానికి తగ్గట్టుగా పన్ను చెల్లించడం లేదని పేర్కొన్నారు. ఆదాయ పన్నులు మినహాయింపు లేకున్నా క్లయిమ్స్‌కు ప్రయత్నం చేసి రిఫండ్ తీసుకుంటున్నారని తెలిపారు. ఇలాంటివారిని ఉపేక్షించేది లేదని, నోటీసులు ఇచ్చి పన్నులు రాబడతామని చెప్పారు. సురేష్ బత్తిని మాట్లాడుతూ అనేకమంది వ్యాపారులు కోట్లల్లో వ్యాపారం చేస్తూ పన్ను ఎగవేస్తున్నారని పేర్కొన్నారు. వీరంతా రిటర్న్ ఫైల్ చేసి పన్ను చెల్లించాలని చెప్పారు. సునీత బిల్లా మాట్లాడుతూ వ్యాపారులు సక్రమంగా టాక్స్ చెల్లిస్తే ఎటువంటి నోటీసులు, చట్టపరమైన చర్యలు ఉండవని తెలిపారు. టాక్స్ ఎగవేతకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పటాన్ షరీఫ్ ఖాన్ మాట్లాడుతూ ప్రతి వ్యాపారుడుటాక్స్ చెల్లించేలా సూచనలు, సలహాలు ఇస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరిని టాక్స్ పరిధిలోకి తెచ్చేలా కృషి చేస్తున్నామని తెలిపారు. స్క్రూటి నీ విషయంలో వ్యాపారుల పట్ల చాలా కఠినంగా వ్యవహరిస్తున్నారని, స్క్రూటీని సరళతలం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్కమ్ టాక్స్ ఆఫీసర్లు సత్యనారాయణ, పి.వి.రమణ, చార్టెడ్ అకౌంటెంట్లు, ఇన్కమ్ టాక్స్ ఆడిటర్లు, ఆదాయపన్నుశాఖ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



అధికారులను సన్మానిస్తున్న పఠాన్ షరీఫ్‌ఖాన్

నేడు యథావిధిగా 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొ న్నారు. ఈ మేరకు ఆదివారం తన నివాసంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, ఎంపిడిఒ తాజ్‌మస్రూర్, ఇతర అధికారులతో వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చేపట్టాల్సిన కార్యాచరణపై సమీక్ష నిర్వహించారు. అంతేకాకుండారంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో మసీదుల ప్రాంతంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. నియోజకవర్గం పరిధిలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తుకుండా ముందస్తు చర్యలు చేపట్టేందుకు అధికారులతో సమీక్ష చేశామన్నారు. కొత్తగా బోర్లు డ్రిల్ చేయించడం, పైపులైన్లు పునరుద్ధరించడం వంటి కార్యక్రమాలకు ప్రథమ ప్రాధాన్యత కల్పించాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులతో పాటు టిడిపి నాయకులు చిన్న మహేష్, కమలామరి కృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

'మిట్స్'ను సందర్శించిన అమెరికా ప్రతినిధులు

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లె సమీపం లోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలను అమెరికాలోని న్యూ హాంప్షైర్ లోగల నషువాలోని రివియర్ విశ్వవిద్యాలయం నుంచి స్ట్రాటజిక్ గ్లోబల్ ఎంగేజ్మెంట్ డైరెక్టర్ బారిగాడే సందర్శించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. ఈ సందర్శన మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల, రివియర్ విశ్వవిద్యాలయం రెండు సంస్థల మధ్య విద్యా సహకారాన్ని పెంపొందించడం, విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టడం , భవిష్యత్ విద్యా భాగస్వామ్యాలను బలోపేతం చేయడానికి ఒక అవగాహన ఒప్పందం పై సంతకం చేయడం లక్ష్యంగా చర్చలు జరిగాయని అన్నారు. ఉన్నత విద్యలో సహకార అవకాశాలు, అంతర్జాతీయ పరిశోధన కార్యక్రమాలు పెంపొందిచడం ఈ ఒప్పందం ముఖ్య ఉదేశ్యంమని అన్నారు. విద్యార్థులకు ప్రపంచ విద్యా బహిర్గతం, సాంస్కృతిక అభ్యాసం , అంతర్జాతీయ విద్య ప్రయోజనాలపై విలువైన సమాచారం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో శిక్షణ, నియామకాల అధిపతి వేణుచౌదరి, డీన్ అడ్మినిస్ట్రేషన్, ఇంటర్నేషనల్ రిలేషన్స్ డాక్టర్ శ్రీమంత్ బసు, సీనియర్ మేనేజర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ యు. విజయలక్ష్మి, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే ప్రమాదాల నివారణ

- వేసవిలో అప్రమత్తత అవసరం
- మెలకువలు పాటించాలి
- జిల్లా అగ్నిమాపక అధికారి టి.అనిల్ కుమార్

ప్రజాశక్తి- రాయచోటి



ముఖా ముఖి..

జాగ్రత్తలతో అగ్ని ప్రమాదాలను నివారించవచ్చు. ముఖ్యంగా వేసవిలో ప్రతి ఒక్కరూ చాలా అప్రమత్తంగా ఉండాలి. ప్రమాదాలను నివారించేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా అగ్నిమాపక అధికారి టి. అనిల్ కుమార్ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో వేసవిలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ప్రమాదాలు సంభవిస్తే ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయాలను ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ముఖా ముఖి ద్వారా వివరించారు.

జిల్లాలో ఫైర్ స్టేషన్లు వివరాలు తెల్పండి?

జిల్లా వ్యాప్తంగా 8 ఫైర్ స్టేషన్లున్నాయి. రాయచోటి, లక్కిరెడ్డిపల్లి, రాజంపేట, రైల్వేకోడూర్, పీలేరు, వాల్మీకిపురం, మదనపల్లి, ములకలచెరువు ప్రాంతాలలో ఫైర్ స్టేషన్లున్నాయి. 8 వాహనాలు, జీపు, బుల్లెట్ ఉన్నాయి.

జిల్లాలో బాణసంచా ఫ్యాక్టరీలు ఎన్ని ఉన్నాయి?

జిల్లాలో 10 లైసెన్స్ బాణ సంచా ఫ్యాక్టరీలున్నాయి. రాయచోటిలో 6, రైల్వేకోడూరు 2, పుల్లంపేటలో 1, గాలివీడు 1 ఫ్యాక్టరీ ఉన్నాయి.

ఫైర్‌మెన్లకు ఎలాంటి శిక్షణలిస్తున్నారు?

అగ్నిమాపక కార్యాలయంలో విధులు చేసే సమయంలో నాలుగు నెలలు శిక్షణ ఇస్తారు. స్విమ్మింగ్ శిక్షణ తర్వాత గోవా, బెంగళూరు, ఒరిస్సాలలో ప్రత్యేక శిక్షణకు పంపిస్తాం. నాగపూర్లో చైర్ ట్రైనింగ్ ఇస్తారు.

ఇరుకైన ప్రాంతాల్లో ప్రమాదం జరిగినప్పుడు ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

ఇరుకైన ప్రదేశాలలో ప్రమాదాల జరిగినప్పుడు మెయిన్ రోడ్డు పైన అగ్నిమాపక వాహనం ఆపి ఒసరీల్డ్ ద్వారా ప్రమాదాలను అరికడతాం. బెస్ట్ బుల్లెట్ వాహనం కూడా వాడతాం. అవసరమైతే ఇంకా ఇరుకైన చోట మిస్ బుల్లెట్ ఉపయోగించి ప్రమాదాలను అరకడతాం.

అగ్ని ప్రమాదంలో నివారించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ప్రతి ఒక్కరు ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలి. చిన్న పిల్లలకు అగ్గిపెట్టలు, లైటర్లు, టపాసులు ఇతర మండే పదార్థాలను అందుబాటులో ఉంచరాదు. ప్రజలు కాల్చిన సిగరెట్ బీడీలు అగ్గిపుల్లలు పూర్తిగా ఆర్పి పారవేయాలి. వంట గదిలో గాలి, వెలుతురు ఉండేలా చూసుకోవాలి. ఎల్‌పిజి గ్యాస్ వాడకం పూర్తి అయిన వెంటనే రెగ్యులేటర్ ఆఫ్ చేయాలి. గ్యాస్ లీక్ అవుతునట్లు అనుమానం వస్తే వెంటనే రెగ్యులేటర్ ఆఫ్ చేయాలి. వంటగదిలో కిరోసిన్, పెట్రోల్, అదనపు గ్యాస్ సిలిండర్‌ను ఉంచరాదు.

సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

జిల్లాలో అగ్నిమాపక కార్యాలయాలలో సిబ్బంది కొరత ఉన్నప్పటికీ ఉన్న సిబ్బందితోనే విధులు నిర్వహిస్తున్నాం.

ప్రమాదాలపై ప్రజలకు మీరిచ్చే సూచనలు, సలహాలు?

ప్రతి ఏడాది దీపావళి పండుగ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పిస్తాం. ఏప్రిల్ 14 నుండి 21 వరకు ఫైర్ ఉత్సవాయి నిర్వహిస్తాం. ఒక రోజు ప్రభుత్వ ఆసుపత్రి, పాఠశాలలు, పెట్రోల్ బంక్, గ్యాస్ గోడౌన్, ప్రభుత్వ కార్యాలయాలను ప్రజలు నివాసాల ప్రాంతాలలో అగ్నిప్రమాదాల నివారణ కోసం నిర్వహిస్తాం. ఒకవేళ అనుకోకుండా ప్రమాదాలు జరిగితే వాటిని ఎలా అరికట్టాలో స్థానికులకు వివరిస్తాం. ప్రమాదాలు సంభవించగానే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇస్తే వెంటనే స్పందించి ప్రమాదాల నివారణకు చర్య తీసుకుంటాం. ప్రజలు అగ్ని ప్రమాదాలు జరగకుండా బాధ్యతగా ప్రవర్తించాలి. ఎక్కడైనా ప్రమాదం జరిగితే వెంటనే మాకు కార్యాలయాలకు సమాచారం ఇవ్వాలి.

వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలి

- త్వరలో ఉద్యమ కార్యాచరణపై నిర్ణయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వాల్మీకి ఎస్‌టి సాధన ఉద్యమంగా భవిష్యత్తు కార్యాచరణ నిర్ణయించడం కోసం సమావేశం కావడం జరిగిందని వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి అధ్యక్షులు పొదల నరసింహులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ వాల్మీకుల దీర్ఘకాల ఆకాంక్ష ఎస్‌టి జాబితా పునరుద్ధరణ అన్నారు. అందుకోసం ఎన్నో ఏళ్లుగా ఉద్యమాలు చేస్తున్నా, రాజకీయ పార్టీలు మాత్రం వాల్మీకులను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకొని విస్మరిస్తున్నారని ఆరోపించారు. గత ఎన్నికల ప్రచారంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాల్మీకులకు ఎస్‌టి జాబితా పునరుద్ధరణ బిల్లును అమలు జరిగేలా చూస్తామని హామీలు గుప్పించారని అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో మాత్రం ఆ ఊసే ఎత్తక పోవడం పట్ల విస్మయం వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్ పరిష్కారం కోసం బిసిలతో కలిసి నడవడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. దేశ రాజధాని ఢిల్లీ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలతో పాటు కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, తిరుపతి, అన్నమయ్య జిల్లా నాయకులతో సంప్రదించి సమన్వయం చేసుకొని ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో వాల్మీకుల ఆకాంక్షను నెరవేర్చే విధంగా ఎస్‌టి సాధన బిల్లు కేంద్ర ప్రభుత్వం ఆమోదించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో విఆర్‌ఎస్‌ఎస్ కోశాధికారి విజయ్ మోహన్, కొత్తఉడుము శంకర, వేల్పుల వెంకటరమణ, పలమనేరు మంజు, ఈడిగపల్లి గుర్రప్ప, టమోటో మార్కెట్ రమెష్, చిన్న రెడ్డెప్ప, శ్రీరాములు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరసింహులు



లూయిస్ బ్రెయిలీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కోటేశ్వరరావు

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

విద్య తోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గ్రంథాలయ రాష్ట్ర అధ్యక్షులు గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో లూయిస్ బ్రెయిలీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం పుస్తకాలు, పత్రికలను చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కృష్ణ మోహన్, రవీంద్ర బాబు, జలంధర్ రెడ్డి, సబిత రాణి, మల్లికార్జున రెడ్డి, ఉమా మంజుల, రమాపతి, హెచ్ఎం శ్రీదేవి, టిడిపి నాయకులు కోసూరు చంద్ర, వల్లిగట్ల వెంకటరమణ, కోసూరు రమేష్, గోవిందుపాల్గొన్నారు.

వైసిపిలో పలువురికి పార్టీ పదవులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట



అయూబ్ బాషా, అఖిలేష్‌రెడ్డి

తంబళ్లపల్లి నియోజకవర్గ వైసిపిలో రెండు విభాగాలకు నూతన అధ్యక్షులను ఎంపిక చేశారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారక నాథ్‌రెడ్డి సూచనల మేరకు తంబళ్లపల్లి నియోజకవర్గం పబ్లిసిటీ వింగ్ అధ్యక్షులుగా అయూబ్ బాషా, నియోజకవర్గ విద్యార్థి విభాగం కమిటీ అధ్యక్షులుగా అఖిలేష్‌రెడ్డిని నియమిస్తూ పార్టీ అధిష్ఠానం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో పార్టీ అధిష్ఠానం బాధ్యతలు అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. మాకు అప్పగించిన పదవులను సమర్థవంతంగా నిర్వర్తించి పార్టీని బలీయమైన శక్తిగా తయారు చేయడానికి కృషి చేస్తామన్నారు. 2029లో పార్టీ గెలుపు కోసం అలుపెరుగని కృషి చేస్తామని పేర్కొన్నారు. తమకు పదవులు కేటాయించినందుకు మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. బూత్ కమిటీ అధ్యక్షులుగా బి.కొత్తకోట మండలానికి చెందిన రెడ్డి హరిను, నియమిస్తూ పార్టీ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. **పుల్లంపేట :** వైసిపి బూత్ కమిటీ జోనల్ అధ్యక్షులుగా తల్లెం భరత్ కుమార్ రెడ్డి నియమిస్తూ కేంద్ర కార్యాలయం నియామక పత్రాన్ని జారీ చేసింది. భరత్‌ను బూత్ కమిటీ జోనల్ అధ్యక్షులుగా నియమించడం పట్ల పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మాజీ సిఎం వై.ఎస్.జగన్ తనపై నమ్మకంతో కేటాయించిన పదవికి వన్నె తెచ్చే విధంగా పార్టీ జిల్లాలతో కలిసి పని చేస్తానని భరత్ తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు కృతజ్ఞతలు తెలిపారు.

'ఉపాధి' పనులపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి-కలికిరి:

ఉపాధి హామీ పనులపై సమగ్ర విచారణ చేపట్టాలని సమాచార హక్కు చట్టం పీలే నియోజకవర్గ అధ్యక్షులు మద్దిరాళ్ల మల్లికార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో భారీ స్థాయిలో అవకతవకలు చోటు చేసుకున్నాయని, పెద్ద ఎత్తున నిధులు రావడంతో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి ప్రస్తావించి, అవినీతి అక్రమాలపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని, కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అధికారులకు లేఖ రాయగా, ఉపాధిహామీ నిధులు దుర్వినియోగంపై కేంద్ర ప్రభుత్వం స్పందించి, విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని పి ఆర్ అండ్ ఆర్‌డి డైరెక్టర్‌ను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని అన్నారు. డైరెక్టర్ ఆదేశాల మేరకు పీడీ ఒక్కొక్క బృందంలో ఏపిడి, ఎపిఒ, ఇసిటి, సూపరింటెండెంట్‌తో నాలుగు బృందాలను విచారణ నిమి త్తం ఏర్పాటు చేశారని అన్నారు. కలికిరి మండలం పరిధిలో ఉపాధి నిధుల దుర్వినియోగం, స్కాం మార్గదర్శకాలను ఉల్లంఘించి, మ్యాన్ డేస్ స్థానంలో యంత్రాల ద్వారా పనులు చేపట్టినట్లు స్పష్టమైన ఆధారాలు న్నాయ ని అన్నా రు. బాధ్యులపై అవసరమైన చర్యలు తీసుకోవడానికి, కేంద్ర స్థాయి బృందంతో విచారణ జరిపించాలని, ఎంపీ తమ లేఖలో కోరారని తెలిపారు. ఉపాధి అవినీతి పనులపై తూతూ మంత్రంగా విచారణ చేపట్టరాదని అన్నారు.



మాట్లాడుతున్న ఎఎస్‌పి వెంకటాద్రి

ఘనంగా 'మాధురి' 11వ వార్షికోత్సవం

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని శ్రీరామనగర్‌లో మాధురి ఇంగ్లీషు మీడియం స్కూల్11వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి వెంకటాద్రి పాల్గొని మాట్లాడుతూ మొట్టమొదట నాకు ఉద్యోగం వచ్చినప్పుడు ఎస్ఐగా సుండుపల్లె మండలానికి రావడం జరిగిందని ఇక్కడ ఉండే ప్రజలు నేటికీ కూడా గుర్తు వస్తున్నారని అన్నారు. మాదిరి ఇంగ్లీష్ మీడియం స్కూల్ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడం అభినంద నీయమని పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ సుధాకర్‌ను అభినందించారు. అంతేకాకుండా మంచి విద్యను అందించి విద్యార్థులకు కరాటే , స్విమ్మింగ్ వంటి క్రీడల్లో నైపుణ్య కల్పించడం సంతోషకరమన్నారు. తల్లిదండ్రులు లేని పిల్లలకు ఫీజులు రాయితీ కల్పించడం అభినందనీయమని అన్నారు. సుండుపల్లె ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో మంచి నూతన ఉత్సాహం కలుగుతుందని అన్నారు. బాగా చదువుకొని పాఠశాలకు , తల్లిదండ్రులకు మంచి పేరు తీసుక రావాలని ఆకాంక్షించారు. అనంతరం కస్పాండెంట్ సుధాకర్ మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం మంచి భవిష్యత్తు అందించాలనే ఉద్దేశ్యం ఆహ్లాదకరమైన వాతావరణంలో స్కూల్‌ను ఏర్పాటు చేసి ఉత్తమ విద్యను అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో జబర్దస్త్ నటులు కూడా పాల్గొని ఆట, పాటలతో పిల్లలను ఉత్తేజ పరిచారు. కార్యక్రమంలో ఎంఇఒలు వెంకటేశ్వరనాయక్, రవీంద్రనాయక్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ తులసి నాగప్రసాద్ హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆది వారం ఆయన మహిళల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేక చట్టాలను తెచ్చిందన్నారు. ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే తమకు సమాచారం ఇవ్వాలని మహిళలకు సూచించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ ఖాదర్‌వలి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'పుట్టా'కు సన్మానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు : తాను విద్యను బోధించిన శిష్యుడు, మైదుకూరు నియోజకవర్గ శాసన సభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్‌ను చూసి గర్వపడుతున్నానని విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే స్వగృహంలో ఆది వారం హనుమంతరావు పుట్టా సుధాకర్ యాదవ్‌ను సత్కరించి ఆశీర్వదించారు. అవినీతి అంతానికి ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులు కావాలని గానుగపెంట అన్నారు.

'వెలిగల్లు' చేపలకు పెరుగుతున్న గిరాకీ

ప్రజాశక్తి-గాలివీడు

గత 16 సంవత్సరాల నుంచి వెలిగల్లు ప్రాజెక్టులో చేపలు విస్తారంగా వృద్ధి చెందుతున్నాయి. ప్రతి ఏడాదికి రెండు, మూడు సార్లు మత్స్య శాఖ వారు చేప గుడ్లను తీసుకువచ్చి చేప పిల్లలను ప్రాజెక్టులో వదులుతున్నారు. ఇక్కడ లభించే జిలేబి చేపలు గిరాకీ బాగా పెరుగుతోంది. పట్టణానికి అతి సమీపంలో ఈ ప్రాజెక్టులో ఒక పైసా కూడా డబ్బు కట్టాల్సిన అవసరం లేకుండా ఉచితంగా చేపలు పట్టుకుంటున్నారు. అలా పట్టుకున్న చేపలను మార్కెట్‌లోకి తీసుకువచ్చి కిలో రూ.150లకు చొప్పున విక్రయిస్తున్నారు. ఆదివారం వచ్చిందంటే చేపలకు గిరాకీ పెరిగిపోతోంది. బర్డ్‌ఫ్లూ భయంతో చాలా మంది చికెన్ తినేందుకు జంకుతున్నారు. కిలో మటన్‌కు రూ.850లకు పెట్టి కొనలేని వారు చేపలు కొనేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఇక్కడి చేపలను రాయచోటి, కడప, గుర్రంకొండ, మదనపల్లి ప్రాంతాలకు కూడా తరలిస్తున్నారు. మత్స్య శాఖ అధికారులు దృష్టి పెట్టి ఉచితంగా పడుతున్న చేపలకు ఒక నిర్దిష్టమైన ధర నిర్ణయించి ప్రజలకు అందుబా టులో ఉండేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



చేపలను కొంటున్న స్థానిక ప్రజలు

రక్తదానం ప్రాణదానంతో సమానం : ఎస్ఐ



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల కేంద్రం సుండుపల్లిలోని కెవివీధిలో ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ సయ్యద్‌అహ్మద్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్త కొరత చాలా అధికంగా ఉందని, అందుకోసమే రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 30 మంది యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం అభినందనీయమని అన్నారు. తాను కూడా 59వ సారి రక్తదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానంమని అన్నారు. సమయానికి రక్తం అందక గర్భిణులు, ప్రమాదాల్లో గాయపడిన మృతి చెందుతున్న సంఘటనలు చూస్తుంటామని, అటువంటి వారి ప్రాణాలను కాపాడేందుకు యువత ముందుకు వచ్చి రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ఆరోగ్యవంతులైన యువత రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో అర్చకులు హరికృష్ణ అయ్యర్, ఇమామ్ ముజీబుర్రహ్మాన్, ముహమ్మద్ అలి, అభిషేక్, రమేష్ కత్తి, భూపతి, జగిలి ఓబులేసు, మజహర్, సల్మాన్, ఉమర్, ప్రసాద్, అరుణ్, నవాజ్ క్రిష్, యూసుఫ్, ఫజల్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి :'ముక్కా'

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

కూటమి ప్రభుత్వంతోనే రైల్వేకోడూరు నియోజకవర్గంలో అభివృద్ధి చెందుతోందని కుడా చైర్మన్ ముక్కారూపానందరెడ్డి అన్నారు. కోడూరు మండలం శెట్టిగుంట గ్రామంలో రూ.24లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్లు, డ్రైయినేజీ, తాగునీటి సమస్య వంటి మౌలిక వసతుల ను కల్పిస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాలు అభివృద్ధి బాటలో నడుస్తున్నాయని అన్నారు. గత వైసిపి పాలన హంగూ ఆర్భాటం తప్ప ఏమి లేదన్నారు.గ్రామస్తులు గ్రామం లో విద్యుత్ తీగలు కిందకు ఉన్నాయని తెలపగా వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి ప్రమాదం జరగ కుండా వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయుకులు నీలకంఠయ్య, వెంకట్రామరాజు, సర్పంచ్ సంయుక్త, పగడాల వెంకటేష్, చంద్రశేఖర్, గిరిధర్‌నాయుడు, గోపాల్, పెంచల్‌రెడ్డి, సుబ్బిరామిరెడ్డి, శివయ్యపాల్గొన్నారు.



ముక్కా రూపానందరెడ్డిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ఉత్కంఠ భరితంగా బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని చింతకాయలపల్లె గ్రామంలో వెలిసిన శ్రీ బోళా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివ రాత్రి సందర్భంగా టంగుటూరు మాజీ సర్పంచ్ చింతకాయల గంగినాయుడు ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం నిర్వహించిన బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి, రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, ఎంపీపీ మేడ విజయభాస్కర్ రెడ్డి లు పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలలో పోతిరెడ్డి పల్లెకు చెందిన త్యాగంరెడ్డి లింగారెడ్డి ఎద్దు మొదటి స్థానంలో నిలిచి రూ.30 వేల నగదు బహుమతిని రాజ్యసభ సభ్యులు మేడ రఘునాథ్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ద్వితీయ స్థానంలో పోతిరెడ్డిపల్లెకు చెందిన చాగంరెడ్డి నాగేశ్వరెడ్డి ఎద్దు నిలిచి రూ.20వేలు, మూడో స్థానంలో తాళ్లపాక గ్రామానికి చెందిన రేనాటి సాంబశివరాజు ఎద్దు నిలిచి రూ.10 వేలు అందుకున్నారు.నాలుగో స్థానంలో పాత సంగటి పల్లి చెందిన విశ్వనాథ్‌రెడ్డి వృషభలు 5 వేలు, ఐదో స్థానంలో గుడిపాడు తుమ్మల నారాయణరెడ్డి వృషబాలు నిలిచి రూ.3 వేలు అందుకున్నారు. రాత్రి ఏర్పటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆక్రమిత భూములు, నిర్మాణాలను గుర్తించండి

ప్రజాశక్తి-పీలేరు

మండల పరిధిలో ఆక్రమిత భూములు, అక్రమ నిర్మాణాలను గుర్తించాలని హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమ తెలిపారు. ఆదివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆమె రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌డిసి మాట్లాడుతూ మండలంలో ప్రధానంగా పీలేరు, దొడ్డిపల్లె, యర్రగుంటపల్లె, బోడుమల్ల వారిపల్లె, గూడరేవుపల్లె, ముడుపులవేముల పంచాయతీల పరిధిలో చోటు చేసుకున్న అక్రమా లపై నియోజకవర్గ పరిధిలోని ఇతర మండలాలకు చెందిన రెవెన్యూ అధికారులు ఆరు బృందా లుగా ఏర్పడి క్షేత్రస్థాయిలో సర్వే చేపడుతున్నట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ బృందాలు ఐదు రోజుల పాటు క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి ఆక్రమిత భూములను గుర్తించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ భీమేశ్వరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమ



టిజి వెంకటేష్ స్వాగతం పలుకుతున్న ఆర్యవైశ్య సంఘ సభ్యులు

దేశాభివృద్ధిలో ఆర్యవైశ్యులది క్రియాశీలక పాత్ర

-రాజ్యసభ మాజీ సభ్యులు టిజి.వెంకటేష్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్ర, దేశ అభివృద్ధిలో ఆర్యవైశ్యులు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారని మాజీ రాజ్యసభ సభ్యులు టీ.జి.వెంకటేష్ పేర్కొన్నారు. శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవి మహా కుంభాభిషేక వేడుకలు అట్టహాసంగా ముగిశాయి. చివరి రోజైన ఆదివారం వాసవీ కన్యకా పరమేశ్వరి అలయంలో ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా టి.జి వెంకటేష్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, ఎపి ఆర్యవైశ్య వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పోరేషన్ చైర్మన దూండి రాకేష్, టిటిడి బోర్డు మెంబర్ భానుప్రకాష్ రెడ్డి హాజరుకాగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఓంప్రకాష్, కోశాధికారి సూరే గిరిధర్, కార్యదర్శులు దేవత సతీష్, జయం ప్రవీణ్ కుమార్, యువజన సంఘం అధ్యక్షులు యల్లంపల్లి ప్రశాంత్, ఆర్యవైశ్యా మహిళా సంఘం అధ్యక్షురాలు ఒలేటి లక్ష్మి, కోశాధికారి కుసుమ కుమారిలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో టిజి వెంకటేష్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు జనాభా పరంగా తక్కువ ఉన్నప్పటికీ అన్ని రంగాల్లో వారి ప్రాధాన్యత ఎక్కువగా ఉంటుందని అన్నారు. ముఖ్యంగా మదనపల్లి పట్టణంలో ఆర్యవైశ్యులు ఐకమత్యంతో అనేక సేవా కార్యక్రమాలు దిగ్విజయంగా నిర్వహిస్తున్నారని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ముఖ్యంగా సిఎం చంద్రబాబు ఆర్యవైశ్యుల అభ్యున్నతికి ప్రత్యేక చొరవ చూపుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, ఆర్యవైశ్య కుల బాంధవులు, పట్టణ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

తాపీ మేస్త్రీలకు సర్టిఫికెట్లు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్ వద్ద గల ధాత్రి ఫౌండేషన్ స్కిల్ ట్రైనింగ్ సెంటర్ లో ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా ఏడు రోజులు ఉపాధి శిక్షణ పొందిన తాపీ మేస్త్రి కార్మికులకు ఆదివారం ధాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ స్వాతి, చక్రపాణి సర్టిఫికెట్లు మంజూరు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన టూటౌన్ ఎస్ఐ రహీం మాట్లాడుతూ ఏడు రోజుల శిక్షణ అనంతరం ఉచితంగా అందజేసిన రూ.15 వేలు విలు వ చేసే టూల్ కిట్లని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంకు ద్వారా అతి తక్కువ వడ్డీతో వస్తున్న లక్ష రూపాయల రుణ సదుపాయం తీసుకొని కార్మికులందరూ ఉపాధి అవకాశాలను మెరుగు పరుచుకోవాలన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం ప్రయో జనాలను కార్మికులకు సమకూరుస్తున్న డాక్టర్ స్వాతి చక్రపాణిలను ప్రశంసించారు. కార్యక్ర మంలో ఫౌండేషన్ సిబ్బంది ప్రసన్న, వినీత, తాపీ మేస్త్రి కార్మికులు, ట్రైనింగ్ పార్టనర్ చక్రపాణి పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందుకున్న తాపీ మేస్త్రీలు



పరిటాల శ్రీరామ్ సన్మానిస్తున్న శ్రీరామ్ చినబాబు

పరిటాల శ్రీరామ్‌ను కలిసిన చినబాబు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలో ఆదివారం ఓ కార్యక్రమానికి హాజరైన టిడిపి యువ నాయులు పరిటాల శ్రీరామ్ హాజరయ్యారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు కసి సన్మానించారు. వరుణ్, తెలుగు యువత నాయకులు నాదెళ్ల అరుణ్, మోడెం శివకుమార్ తదితరులు శ్రీరామ్ కు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీరామ్ చినబాబు మాట్లాడుతూ తన తండ్రి స్వర్గీయ పరిటాల రవీంద్ర ఆశయ సాధన కోసం పరిటాల శ్రీరామ్ అలుపెరగని కృషి చేస్తున్నారని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ ముందుంటారని తెలిపారు. సమర్థత, చురుకుతనంతో ఆయన చంద్రబాబు దృష్టిని ఆకర్షించారని కొనియాడారు. చినబాబు వెంటటిడిపి రాజంపేట పార్లమెంట్ జనరల్ సెక్రటరీ దొరస్వామి నాయుడు, తంబళ్లపల్లె నియోజకవర్గం పరిశీలకులు మల్లికార్జున నాయుడు ఉన్నారు.

నేడు పోలేరమ్మ జాతర

ప్రజాశక్తి-గాలివీడు

మండల పరిధిలోని శెట్టివారిపల్లిలో సోమవారం పోలేరమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పూజారి మారువేని శంకరయ్య పేర్కొన్నారు. సోమవారం చెక్కభజనలు, చాందినీబండ్లు, నాణేలతో, అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి ఏడు గంటల వరకు బోనాలు సమర్పిస్తారని తెలిపారు. సాయంత్రం 6 గంటల నుంచి ఆసాదోని వారిచే ఆసాదోని కథ చెప్పబడునని తెలిపారు.

బ్యానర్ల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

- కమిషనర్ జి.వి.పల్లవి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నగర పంచాయతీ పరిధిలో పబ్లిక్ ఆర్డర్, భద్రతను నిర్వహించే ప్రయత్నాలలో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో బ్యానర్ల ఏర్పాటు చేయడానికి, మైక్ ప్రకటనలను ఉపయోగించడానికి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని కమిషనర్ జి.వి.పల్లవి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమె మాట్లాడుతూ అనుమతి లేకుండా బ్యానర్లు కట్టడం, మైక్ అనౌన్స్ మెంట్‌లు ఉపయోగించిన వ్యక్తులు, సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సంబంధిత చట్టాలు, నిబంధనల ప్రకారం జరిమా నాలు విధించ నున్నట్లు తెలిపారు. బ్యానర్లు, మైక్ ప్రకటనల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకుని సహకరించాలని ప్రజలను కోరారు.

నిధులు తేవడంలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు : టిడిపి కూటమి అసెంబ్లీలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ కూతల, కోతల బడ్జెట్‌ను తలపిస్తోందని పిసిసి అధికార ప్రతినిధి నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. శనివారం రాత్రి స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ మొత్తం బడ్జెట్ రూ.3,22,359కోట్లలో రూ.1,04,383కోట్లు అప్పు అన్నారు. గత వైసిపి ప్రభుత్వం శక్తికి మించిన అప్పు చేసిందని చెప్పిన కూటమి ప్రభుత్వం, ప్రస్తుతం అంతకు మించి అప్పు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి అధికారంలో ఉన్నప్పటికీ కేంద్రం నుండి గ్రాంట్లు తేవడంలో బాబు ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. సాగునీటి రంగాన్ని చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. సమావేశంలో ప్రొద్దుటూరు కాంగ్రెస్ నాయకులు షేక్ పూల నజీర్, ప్రొద్దుటూరు మాజీ పట్టణ అధ్యక్షులు జీలాని బాషా, ఖాజాపీర్, సమీర్, షంషీర్, మహమ్మద్, సాహిల్, అమర్నాథరెడ్డి, ఉత్తన్న, రమణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి - పులివెందుల టౌన్:

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా స్థానిక శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన నృత్య ప్రదర్శలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. శ్రీపతి చిన్న బాలుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారి సహకారంతో డ్యాన్స్ మాస్టర్ రాజా ఆధ్వర్యంలో శ్రీరాజా కళా నిలయం చిన్నారులు నృత్య ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో శిల్పారామం అధికారి సుధాకర్, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, ఫీల్డ్ సూపర్వైజర్ ఇస్మాయిల్, సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం : విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని పులివెందుల రూరల్ సిఐ రమణ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని నిడివెల సమీపంలోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు ఈనెల 8న అంత ర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హాకీ క్రీడా పోటీలు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. మహిళల కోసం ప్రత్యేక చట్టాలను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ తులసి నాగప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ గురుదేవి పాల్గొన్నారు.

ఎంఎం రత్నంకు స్వీయ చిత్రం బహూకరణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

చలనచిత్ర నిర్మాత, గేయ రచయిత, కథా రచయిత, దర్శకుడు ఎం రత్నంకు ప్రొద్దుటూరుకు చెందిన ప్రముఖ చిత్రకారుడు రామాంజనేయరెడ్డి స్వీయ చిత్రపటాన్ని ఆదివారం బహూకరించారు. సేవ్ గర్ల్ చైల్డ్ కార్యక్రమంలో భాగంగా ఓ సినిమా షూటింగ్ నిమిత్తం ప్రొద్దుటూరు వచ్చిన ఎంఎం రత్నంకు స్వీయ చిత్రపటాన్ని బహుకరించారు.

క్రైం కార్నర్

అప్పులబాధతో యువకుడి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అప్పుల బాధతో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం పట్టణంలో జరిగింది. రెండో పట్టణ పోలీసుల కథనం మేరకు.. పుంగనూరు రోడ్డు, బసినికొండ శివాలయం వీధిలో కాపురం ఉంటున్న లేట్ మరాఠీ కృష్ణాజిరావు కుమారుడు మరాఠీ నాగరాజ కుటుంబ అవసరాల నిమిత్తం సుమారు రూ.5 లక్షల వరకు అప్పులు చేశాడు. చేసిన అప్పులు తీర్చలేక పోవడంతో అప్పు ఇచ్చినవారి నుంచి ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. తీవ్ర మనస్థాపానికి గురై ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు బాధితున్ని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. కేసు దర్యాప్తులో ఉందని ఎస్ఐ తెలిపారు.

ప్రమాదానికి గురైన దంపతులు

- భార్య మృతి, భర్తకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదానికి గురైన దంపతుల్లో భార్య మృతి చెందగా భర్త తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ సంఘటన ఆదివారం వాల్మీకిపురం మండలంలో జరిగింది. పోలీసుల ఎస్ఐ చంద్రశేఖర్ కథనం మేరకు.. కురబలకోట మండలం, అడవిపల్లికి చెందిన మాహదేవరెడ్డి, శారద(32) దంపతులు శనివారం రాత్రి సొంతపనిపై కారులో తిరుపతికి వెళ్లారు. అక్కడ ఆస్పత్రిలో ఉన్న మహదేవరెడ్డి తండ్రిని పలకరించి తిరిగి కారులో స్వగ్రామానికి బయల్దేరారు. మార్గమధ్యంలోని వాల్మీకిపురం మండలం, విఠలం వద్ద కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దంపతులను స్థానికులు మదనపల్లెకు తరలించగా, శారద మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన మహాదేవరెడ్డిని బెంగుళూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.